సాక్షి ప్రకాశం

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



వృద్ధురాలి దారుణ హత్య

పశువుల మేత కోసుకొచ్చేందుకు పొలానికి వెళ్లిన వృద్ధురాలిని తలపై బలంగా కొట్టి హత్య చేసి ఆమె ఒంటిపై బంగారాన్ని దోచుకున్న ఘటన దీజీపేటలో జరిగింది. - 8లో..



అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

చీమకుర్తి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.7/25

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు ?'

- నేటి నుంచి పోస్టుకార్డు ఉద్యమం

ఒంగోలు వన్‌టౌన్: మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని సూపర్ సిక్స్ పథకం ద్వారా ప్రచారం నిర్వహించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 4 నెలలు అవుతున్నా ఇంత వరకూ పథకం ఊసు ఎత్తడంలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సైదా ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది మహిళలకు ఈ పథకం ఉపయోగపడేదన్నారు. అయినా కూటమి ఉచిత బస్సు పథకం అమలు చేయడంలేదన్నారు. దీనికి నిరసనగా జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించి పోస్టు కార్డుల ద్వారా నిరసన కార్యక్రమాన్ని సోమవారం నుంచి 23వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో, కనిగిరి బస్టాండ్‌లో, సాయంత్రం 4 గంటలకు కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ బస్టాండ్‌లో, 22వ తేదీ ఉదయం దర్శి, మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌ల్లో, 23వ తేదీ ఉదయం గిద్దలూరు, యర్రగొండపాలెం ఆర్టీసీ బస్టాండ్‌ల్లో చేపడతారన్నారు.

దళిత గిరిజనుల హక్కులు కాలరాస్తున్నారు

- ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం

ఒంగోలు సిటీ: దళిత గిరిజనులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రధాని నరేంద్రమోదీ కాలరాస్తున్నాడని ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం ఆరోపించారు. ఒంగోలు ముంగమూరు రోడ్డులోని గాంధీ నగర్ వద్ద అంబేడ్కర్, పూలే, గౌతమ బుద్ధుని విగ్రహాలు (మూడు బొమ్మల సెంటర్) వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయని మండిపడ్డారు. దేశ సంపదను ఆదానీ, అంబానీలకు కట్టపెట్టేలా గిరిజనులు నివసించే కొండప్రాంతాల నుంచి ఖాళీ చేయిస్తున్నాడన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. దళితులు దేశవ్యాప్తంగా తీవ్రమైన ఉద్యమాలు చేశారని, ఆ ఉద్యమాల్లో 11 మంది దళితులు చనిపోయారన్నారు. దళితుల మధ్య వైషమ్యాలు పెంచి రాజ్యాన్ని ఏలాలని చూస్తున్నారని విమర్శించారు. తక్షణం ప్రభుత్వమే వర్గీకరణ నిలుపుదల చేసేందుకు రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. డీజీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ కె.వర ప్రసాద్ మాట్లాడుతూ దళితుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు రానున్న కాలంలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఐఎల్‌పీ జిల్లా అధ్యక్షుడు కట్టా వరప్రసాద్, డీబీఆర్‌సీ జిల్లా నాయకులు కోటేశ్వరరావు, కేఎస్‌పీఎస్ నాయకులు సుబ్బారావు, నరసింహారావు, డి.నరసింహారావు పాల్గొన్నారు.

చెడ్డీగ్యాంగ్ కలకలం



చీకటిపడితే చాలు దొంగల ముఠాలు జిల్లాలో స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఒక చోట ఇళ్లలోకి దూరి నగలు, నగదు కాజేస్తున్నాయి. ఒంటరి మహిళలు ఉండే ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వారిని దారుణంగా కొట్టి దోచుకుపోతున్నారు. వీరికి తోడు చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తుండటం జనం కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. జిల్లాలోకి చెడ్డీగ్యాంగ్ ప్రవేశించిందని, అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ పోలీసు సిబ్బందిని ఆదేశించడం.. స్వయంగా ఆయనే అర్ధరాత్రి వాహనాల తనిఖీలు చేస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

- ఒంగోలులో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్
- నర్సింగ్ కాలేజీలో రూ.1.50 లక్షల చోరీ
- ట్రిపుల్ ఐటీలోకి ప్రవేశించిన దొంగలు
- జిల్లాలో పెరిగిపోతున్న చోరీలు
- ఒంటరి మహిళలు ఉన్న ఇళ్లే లక్ష్యం
- ఒంగోలులో రైల్వే ట్రాక్ పక్కనే దొంగతనాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లా కేంద్రమైన ఒంగోలులో చెడ్డీ గ్యాంగ్ ప్రవేశించడం కలకలం రేపుతోంది. కొద్ది రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో చెడ్డీ గ్యాంగ్ ప్రవేశించిందన్న వార్తతో నగర ప్రజలు మరింత భయాందోళనలకు గురవుతున్నారు. నిజానికి నాలుగు నెలలుగా జిల్లాలో చోరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒంగోలుతో పాటుగా మార్కాపురం డివిజన్‌లో కూడా ఎక్కడో ఒక చోట ప్రతిరోజూ దొంగతనాలు జరుగుతుండడం నిత్యకృత్యంగా మారింది. అర్ధరాత్రి ఇళ్లలోకి ప్రవేశించిన దొంగలు అవసరమైతే దాడులు చేసి మరీ నగలు, నగదును దొంగిలిస్తున్నారు. కళ్లుమూసి తెరచేలోపే మాయమవుతున్నారు. వరసగా దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు తీసుకుంటున్న చర్యలు పెద్దగా ఫలితం ఇవ్వడం లేదు. పోలీసులు నామమాత్రంగా గస్తీలు తిరుగుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే పరమ కిరాతకులుగా పేరొందిన చెడ్డీ గ్యాంగ్ ప్రవేశించారన్న వార్తలు ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. ఇప్పటికైతే పెద్ద ఘటనలు జరగకపోయినా గత కొద్ది రోజులుగా నగరంతో పాటుగా మండలంలో ఒంటరి వృద్ధులపై జరిగిన దాడులు చెడ్డీగ్యాంగ్ పనేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు నెలల కాలంలో దొంగల దాడిలో ఇద్దరు వృద్ధ మహిళలు మరణించడం ఆందోళన కలిగించే విషయం. ఈ రెండు ఘటనలలో కొత్తపట్నం నిందితులు వారికి వారే లొంగిపోయారు. ఉలిచి ఘటనలో ఇప్పటి వరకు నిందితులు పట్టుబడలేదు.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా...

ఎప్పటిలాగే పోలీసులు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఆలస్యంగా మేలుకున్నారు. చెడ్డీగ్యాంగ్ వచ్చి చోరీ చేసి వెళ్లిన తరువాత గస్తీమే సవాల్ అంటూ బస్తీ మీద పడ్డారు. రాత్రి 10 గంటల నుంచి 4.30 ల వరకు నగరంలో పోలీసులు గస్తీ తిరిగి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 35 టీములుగా ఏర్పడి ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. ఏకంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ సైతం తనిఖీలలో పాల్గొనడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. అర్ధరాత్రి ఎస్పీ గస్తీ తిరగడం చర్చనీయాంశమైంది. అంతే కాకుండా శనివారం మార్కాపురం డీఎస్పీ నాగరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒంగోలు నగరంలో చెడ్డీ గ్యాంగ్ ప్రవేశించారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. జిల్లాలోకి చెడ్డీ గ్యాంగ్ ప్రవేశించిన విషయంలో సెట్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తాన్ని అప్రమత్తం చేసినట్లు సమాచారం.

నర్సింగ్ కాలేజీలో రూ.1.50 లక్షల చోరీ...

రెండు రోజుల క్రితం రైలు మార్గం ద్వారా చెడ్డీ గ్యాంగ్ జిల్లాలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి నగర శివారులో నెల్లూరు జాతీయ రహదారికి పక్కనే ఉన్న ట్రిపుల్ ఐటీ కాలేజీలోకి చెడ్డీ గ్యాంగ్ బృందం ప్రవేశించింది. ఫెన్సింగ్ తొలగించుకొని కాలేజీలోకి చొరబడిన ఐదుగురు దొంగల బృందం కాలేజీ ఆఫీసులోకి ప్రవేశించారు. అక్కడ నగలు కానీ నగదు కానీ లభించక పోయే సరికి మరో గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అంతలో కాలేజీ సెక్యూరిటీ సిబ్బంది గట్టిగా కేకలేయడంతో పారిపోయారు. అక్కడ నుంచి నేరుగా రైల్వే ట్రాక్ పక్కనే నడుచుకుంటూ రాం నగర్ 8వ లైనులోకి చేరుకున్నారు. అక్కడ ఉన్న నర్సింగ్ కాలేజీలోకి ప్రవేశించారు. ఇక్కడ పెద్దగా సెక్యూరిటీ లేకపోవడంతో సులువుగా వచ్చిన పని కానిచ్చుకున్నారు. ఆఫీసులో రూ.1.50 లక్షలు చోరీ చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడ నలుగురు దొంగలు కాలేజీలోకి ప్రవేశించడం సీసీ కెమెరాలలో రికార్డు అయింది.

ఒంటరి వృద్ధ మహిళలే టార్గెట్‌గా చోరీలు...

జిల్లాలో నాలుగు నెలలుగా వరుసగా ఒంటరిగా జీవిస్తున్న వృద్ధ మహిళల ఇళ్లలో దొంగతనాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొత్తపట్నంలోని నాంచారమ్మ తల్లి కాంప్లెక్స్ సమీపంలో కల్లుగీత కార్మికురాలైన గుడిపల్లి రమణమ్మ అనే వృద్ధురాలు కల్లు దుకాణం నిర్వహిస్తుంటుంది. ఆమె ఒంటరిగా ఉన్న సమయం చూసుకొని ఆమెపై దాడి చేసిన దొంగలు ఆమె చెవులకు ఉన్న కమ్మలు, నగదు దోచుకెళ్లారు. ఈ దాడిలో ఆమె మృతి చెందింది. ఈ ఘటనలో నిందితులు వారికి వారే లొంగిపోయారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ఒంగోలు మండలంలోని ఉలిచి గ్రామంలో ఒంటరిగా నివశిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి ఊపిరాడకుండా చేసిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలోనూ వృద్ధురాలు మరణించింది. నెలలు గడుస్తున్నా ఈ కేసులో నిందితులను ఇప్పటి వరకు పోలీసులు పట్టుకోలేక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన జరిగిన వారం రోజులు కూడా గడవకుండానే ఒంగోలు నగరంలోని అంబేడ్కర్ నగర్ ఎదురుగా ఇందిరా కాలనీలో దొంగలు పడ్డారు. ఒంటరిగా నివశిస్తున్న వృద్ధురాలిపై దాడి చేశారు. ఆమె స్పృహ కోల్పోయిన తరువాత తీరిగ్గా బీరువా పగులగొట్టి లక్ష రూపాయల నగదు, ఆమె ఒంటిపై నగలను తీసుకెళ్లారు. గత నెలలో ఒంగోలు నగరంలోని కాకతీయ నగర్‌లో ఒంటరిగా నివశిస్తున్న వృద్ధురాలి ఇంటిలోకి దొంగలు ప్రవేశించారు. తిరగబడిన వృద్ధురాలి గుండెలు, ముఖం మీద పిడిగుద్దులు కురిపించారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయారు. ఆ తరువాత ఆమె ఒంటిమీద నగలను, బీరువాలోని నగదును తీసుకొని వెళ్లిపోయారు. అయితే ఈ చోరీ కేసులో ఒక పాత నేరస్తుడిని పోలీసులు పట్టుకున్నారు. మరొక దొంగ తెల్లారేసరికల్లా చెన్నయ్ చెక్కేశాడు. ఇప్పటి వరకు అతడిని పట్టుకున్నదీ లేనిది తెలియదు.

ముసుగులు ధరించి..నిక్కర్ వేసుకొని...

నర్సింగ్ కాలేజీలోకి ప్రవేశించిన దొంగలంతా సుమారు 25 నుంచి 30 ఏళ్లలోపు ఉన్నారు. తలపై ముసుగు ధరించారు. నిక్కర్లు వేసుకొని ఉన్నారు. దాదాపుగా గ్యాంగ్ మొత్తం టీ షర్టులు ధరించి ఉన్నారు. చేతుల్లో ఏవో పరికరాలు ఉన్నాయి. చెప్పుల శబ్దాలు వినబడకుండా చెప్పులను చేతిలో పట్టుకున్నారు. సీసీ కెమెరాలలో దొరక్కుండా ఉండేందుకు తలల వంచి లోపలికి ప్రవేశించడం సీసీ కెమెరాలలో రికార్డయింది. చోరీ తరువాత తిరిగి రైలెక్కి వెళ్లిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.



నర్సింగ్ కళాశాలలో సీసీ కెమెరాలో రికార్డయిన చెడ్డీ గ్యాంగ్ ముఠా కదలికలు

మధ్యప్రదేశ్ గ్యాంగ్ ప్రవేశించింది జాగ్రత్త



ఒంగోలు నగరంలోని నర్సింగ్ కళాశాలలో చెడ్డీ గ్యాంగ్ ముఠా చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాలలో రికార్డయింది. ఈ ముఠా మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా. ట్రైబల్స్ అయిన వీరంతా రైల్లోనే ప్రయాణిస్తారు. పగటి వేళలో రెక్కీ చేసి, రాత్రి వేళలో దొంగతనాలు చేస్తుంటారు. చెడ్డీ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. శాఖా పరంగా పోలీసులు పైపు నుంచి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా పోలీసుల సూచనలు పాటించి తగిన జాగ్రతలు తీసుకోవాలి.

– డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

బడి నిర్వహణ గాలికి

గత ప్రభుత్వంలో పేద విద్యార్థులకు చేరువైన ప్రభుత్వ విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటి వరకు తల్లికి వందనం ఊసే ఎత్తని ప్రభుత్వం నిర్వహణ గ్రాంటును కూడా విడుదల చేయకుండా సర్కారీ పాఠశాలలను గాలికి వదిలేసింది. దీంతో చిన్న చాక్‌పీస్ కొనాలన్నా హెచ్‌ఎంలే తమ జేబులో డబ్బులు పెట్టుకోవాల్సి వస్తోంది.

- ప్రభుత్వ పాఠశాలలకు విడుదల కాని నిర్వహణ నిధులు
- నాలుగు నెలలుగా పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- చాక్‌పీస్, డస్టర్, చిన్నపాటి మరమ్మతులకూ ఇబ్బందులే
- హెచ్‌ఎంలు, ఎంఈఓలపై భారం



బేస్తవారిపేట జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

బేస్తవారిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు ప్రభుత్వం ఏటా నిర్వహణ గ్రాంటు విడుదల చేస్తుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా పాఠశాలల నిర్వహణ గ్రాంటు విడుదలకు నోచుకోలేదు. దీంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే చాక్‌పీస్, డస్టర్, మైనర్ రిపేర్లకు జేబులో నుంచి డబ్బులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీరు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, విద్యా బోధనకు అవసరమయ్యే సామగ్రి, సమావేశాలకు అవసరమయ్యే ఖర్చులు, చైతన్య కార్యక్రమాల నిర్వహణ, బెంచీలు, తలుపులు మరమ్మతుల భారం హెచ్‌ఎంలు, ఎంఈఓలపై పడుతోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందో లేదోనని అయోమయంలో ఉన్నారు. జిల్లాలో 1686 ప్రాథమిక పాఠశాలల్లో 63,825 మంది, 195 యూపీ పాఠశాలల్లో 20,545 మంది, 245 ఉన్నత పాఠశాలల్లో 72075 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు

పాఠశాలల్లో 20లోపు విద్యార్థులు చదువుతుంటే రూ.10 వేలు, 21 నుంచి 49లోపు విద్యార్థులుంటే రూ.15 వేలు, 50 నుంచి 100 లోపు రూ.20 వేలు, 101 నుంచి 250లోపు రూ.50 వేలు, 251 నుంచి 1000లోపు రూ.75 వేలు, వెయ్యి మందిపైన విద్యార్థులుంటే రూ.లక్ష వరకు నిధులు విడుదల చేస్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాల నిర్వహణ గ్రాంటుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకాలంలో నిధులు మంజూరు చేసేవారు. పాఠశాలల్లో అవసరమైన ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించేవారు. పాఠశాల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంది.

గ్రాంట్ కోసం ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల నిర్వహణ గ్రాంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. గతంలో అమ్మ ఒడి పథకం నుంచి కొంత మినహాయించి నిధులు అందజేసేవారు. ప్రస్తుతం తల్లికి వందనం ఈ ఏడాది ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ఒక వేళ ఇవ్వకపోతే ఇక నిర్వహణ గ్రాంటు పరిస్థితి ఏంటోనని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

రైల్లో తిందాం రండి..!

- రైల్వే స్టేషన్‌లో కోచ్ రెస్టారెంట్
- ఒంగోలు ప్రజలకు కొత్త అనుభూతిని పంచేందుకు రైల్వే శాఖ ప్రయత్నం



రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేయనున్న కోచ్ రెస్టారెంట్ కోసం తరలించిన రైలు బోగీ

ఒంగోలు టౌన్: ప్రయాణికులను ఆకట్టుకునేందుకు, వారికి వినూత్న అనుభూతిని పంచేందుకు రైల్వే అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక పనికిరాదు అని అధికారులు నిర్ధారించిన రైలు బోగీలను గతంలో డిపోకు పంపించి పాత ఇనుము కింద విక్రయించేవాళ్లు. మారిన కాలంతో పాటు రైల్వే అధికారుల ఆలోచనా విధానం కూడా మారింది. పాత బోగీ లోపల మార్పులు చేర్పులు చేసి ఆధునిక రెస్టారెంట్‌గా మార్చివేసి వినియోగంలోకి తీసుకొస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన రైల్వే కేంద్రాల్లో కోచ్ రెస్టారెంట్లను ఏర్పాటు చేసి రైలు ప్రయాణికులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ, రాజమండ్రి రైల్వే స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్లు విజయవంతం కావడంతో ఇప్పుడు ఒంగోలు రైల్వే స్టేషన్లో కూడా కోచ్ రెస్టారెంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కొద్ది నెలలుగా జరుగుతున్న ప్రయత్నం ఇప్పటికి పట్టాలెక్కిందని ఒంగోలు రైల్వే అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోచ్ ఏర్పాటులో భాగంగా విజయవాడ నుంచి రైలు మార్గంలో తరలించిన బోగీని ఆదివారం టెన్ టైర్ లారీ ద్వారా కొత్తపట్నం బస్టాండు మీదుగా రైల్వే స్టేషన్ వద్దకు తరలించారు. స్టేషన్ ఎదురుగా కార్ పార్కింగ్ పక్కన ఇప్పటికే ట్రాక్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాక్‌పై ఫిక్స్‌డ్ వీల్స్‌ను ఏర్పాటు చేసి దాని మీద బోగీని ఉంచారు. రెస్టారెంట్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే టెండర్ కార్యక్రమం కూడా పూర్తయిందని సమాచారం. త్వరలోనే ఈ బోగీనీ కాంట్రాక్టర్‌కు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెస్టారెంట్‌లో టీ, కాఫీ, టిఫిన్, భోజనం అందుబాటులో ఉంటుందని, ప్రయాణికులే కాకుండా నగర ప్రజలు ఎవరైనా ఈ కోచ్ రెస్టారెంట్‌కు వచ్చి భోజనం చేయవచ్చని వివరించారు. సాయంత్రం పూట కోచ్ ఎదురుగా కుర్చీలు వేసుకొని టీ, కాఫీ తాగేందుకు కొంత స్థలాన్ని కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద ఒంగోలు ప్రజలకు కోచ్ రెస్టారెంట్ కొత్త అనుభూతి ఇవ్వనుంది.

అభివృద్ధి పనులకు పోలీసు అమరవీరుల పేర్లు

- నేటి నుంచి 31వ తేదీ వరకు అమరవీరుల వారోత్సవాలు
- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: అమర వీరుల గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు పోలీసు అమరవీరుల పేర్లు పెట్టేలా ఆయా గ్రామాల ప్రజలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కలిసి సూచనలివ్వనున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. గ్రామంలో నిర్మించే పాఠశాల, రోడ్డు లాంటి వాటికి అమరుల పేర్లు పెట్టాల్సిందిగా కోరనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. నేటి నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న పోలీసు అమర వీరుల వారోత్సవ వివరాలను వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమర వీరులను స్మరించుకుంటూ నివాళులర్పిస్తారు. స్మృతి పరేడ్ నిర్వహిస్తారు. ఈ నెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి పోలీసు అమరవీరుల గ్రామాలు, పట్టణాలను సందర్శిస్తారు. వారు చదివిన పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి అమరుల చిత్రపటాలను పెట్టి నివాళులర్పిస్తారు. అమరవీరుల త్యాగాలను తెలియజేసి శ్రద్ధాంజలి ఘటించడం, వారి సేవలను కొనియాడడం లాంటి కార్యక్రమాలు చేపడతారు. 22 నుంచి 31వ తేదీ వరకు ఓపెన్ థియేటర్లలో పోలీసుల దేశభక్తిని తెలిపే చిత్రాలను ప్రదర్శించనున్నారు. జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు అమరవీరులకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 24 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, పోలీసు పిల్లలకు వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తారు. 26 నుంచి 31వ తేదీ వరకు ఒంగోలులోని పోలీసు కళ్యాణ మండపంలో పోలీసులకు సంబంధించిన ఆయుధాలు, పరికరాలు, సాధనాలను, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహించనున్నారు. 28వ తేదీ మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు. 29వ తేదీ పోలీసుల త్యాగాలపై ప్రముఖుల ద్వారా సెమినార్లు నిర్వహించనున్నారు. 30వ తేదీ పోలీసు అమరవీరుల కుటుంబాల్లో ప్రత్యేక విజయాలు సాధించిన వారికి సన్మానాలు, 31వ తేదీ ఏక్తా దివస్‌ను నిర్వహించడంతో వారోత్సవాలు ముగియనున్నాయి.



ఒంగోలులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉన్న పోలీసు అమర వీరుల స్థూపం

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం రాయితీ

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు, మండల ఎడ్యుకేషన్ అధికారులు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జర్నలిస్టు పిల్లలకు తప్పనిసరిగా 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇద్దరు ఏపీపీలకు స్థాన చలనం

ఒంగోలు: జిల్లాలో ఇద్దరు ఏపీపీలకు స్థానం చలనం కలిగిస్తూ హోం విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడలో నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.ప్రశాంతికుమారిని ఒంగోలులోని ఎస్సీ, ఎస్టీ, 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. ఒంగోలులో ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న జేఎస్ జోస్పిన్‌ను ఏలూరు ఒకటో అదనపు జిల్లా కోర్టు డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగుల వేతనం పెంచాలి

ఒంగోలు టౌన్: సుదీర్ఘ కాలంగా అర్బన్ హెల్త్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సీఐటీయూ అధ్యక్షుడు కె. హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు వారికి మినిమం టైం స్కేలు అమలు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేసే ఉద్యోగాల్లో అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగులకు వెయిటేజి ఇవ్వాలని, బదిలీ సౌకర్యం కల్పించాలని తీర్మానం చేశారు. యూపీహెచ్‌సీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక అర్బన్ హెల్త్ సెంటర్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కె. హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేంద్ర, కోశాధికారిగా షేక్ ఖాజా వలి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, ఉపాధ్యక్షులుగా నిర్మల కుమారి, వాసవి, ఆంజనేయులు, కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు, సుభాషిణి, జి.రామారావు, ఏ. ఆంజనేయులు ఎన్నికయ్యారు.



యూపీహెచ్‌సీ నూతన కమిటీ

క్లుప్తంగా

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

మార్కాపురం టౌన్: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ, ఇండోర్‌ఫ్యాక్టరీ వెనుక ప్రాంతంలో ఉదయం పూట దొంగతనాలకు పాల్పడుతున్న కర్నూలుజిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామానికి చెందిన కొండేటి ఇంద్ర పవన్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. ఇతనిపై పట్టణపోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదై ఉన్నాయన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుని వద్ద నుంచి కంప్యూటర్ మానిటర్, టీవీ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితున్ని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రూ.87,440 విలువైన బాణసంచా పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎస్సై

కనిగిరి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి సామగ్రిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక బొడ్డుచావిడి వీధిలో ఉన్న వలరాం (మార్వాడి రాజస్థాన్) దుకాణంపై ఎస్సై టి.శ్రీరాం సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఉంచిన సుమారు రూ.87,440 విలువైన దీపావళి టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టణంలో ఎవరైనా అనుమతులు లేకుండా దీపావళి మందుగుండు సామగ్రి, క్రాకర్స్ వగైరా వస్తువులు నిల్వ ఉంచినా, విక్రయించినా అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపిక



విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న ఎన్ఆర్ఐ బెజవాడ శ్రీనివాసులు

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎస్‌కే మహ్మద్ రఫీ అండర్ – 17 వాలీబాల్ జిల్లా జట్టుకి ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో ఈ నెల 21 నుంచి జరగనున్న వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారన్నారు. విద్యార్థికి జమ్ములపాలెం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బెజవాడ శ్రీనివాసులు రూ.5 వేలను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. బెజవాడ వెంకటేశ్వర్లును కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాలకు చెందిన కె.సాయిసుభ్రాంత్, ఏ రాకేష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సి.నారాయణస్వామి ఆదివారం తెలిపారు. అండర్-19, అండర్-14 విభాగాల్లో ఇద్దరు బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు ఆడనున్నట్లు చెప్పారు. ఈనెల 21వ తేదీన సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని తెలిపారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారన్నారు. విద్యార్థులను పీఈటీ కె.మమత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఊరంతా అప్పు చేసి.. ఆపై ఉడాయించి..!

- ఓ బాధితుడి ఫిర్యాదుతో వ్యాపారిపై కేసు నమోదు

మార్కాపురం రూరల్: ఓ కిరాణా కొట్టు వ్యాపారి అందినకాడికి అప్పు చేసి, గ్రామం నుంచి దుకాణం సర్దేశాడు. మార్కాపురం మండలం బొడిచెర్ల గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఉదంతం ఓ బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. బొడిచెర్ల గ్రామానికి చెందిన వెలుగురి వెంకట సత్యవరప్రసాద్ కిరాణా దుకాణం నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన 50 మంది నుంచి సుమారు రూ.2.50 కోట్లు అప్పు తీసుకున్నాడు. కుటుంబ సభ్యులైన భార్య లక్ష్మి, తల్లి గౌరమ్మ, అత్తమామలు ఆరవీటి కొండలు, శేషారత్నం, బావమరుదులు సురేష్, సాయితో కలిసి ఎవరికీ తెలియకుండా ఊరు వదిలి వెళ్లిపోయాడు. సత్య వరప్రసాద్ చేసిన మోసంపై గ్రామానికి చెందిన కోలగొట్ల చిన్న పురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమ్మరావు తెలిపారు. సత్యవరప్రసాద్ అప్పు చేసిన సొమ్ముతో కుటుంబ సభ్యుల పేరు మీద వేర్వేరు ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కిల్లర్ హైవే.!

జాతీయ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు

మద్దిపాడు జాతీయ రహదారి నిత్యం రక్తమోడుతోంది. మండల పరిధిలో సుమారు 15 కిలోమీటర్ల మేర ఉన్న జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరుగుతూనే ఉంది. నిద్ర మత్తు, మద్యం మత్తు, అతివేగం ఇలా ఎన్నో కారణాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో పోలీసులు బ్లాక్ స్పాట్లు ఏర్పాటు చేసినా ప్రమాదాలు ఆగడం లేదు.

- అతివేగం, నిద్ర మత్తు, మద్యం మత్తే ప్రధాన కారణాలు
- మైనర్ల డ్రైవింగ్‌తో కూడా ప్రమాదాలు
- మండలంలో ఐదు ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్లు
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంలో అధికారులు, పోలీసులు విఫలం

మద్దిపాడు:

మండలంలోని ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారి సుమారుగా 15 కిలోమీటర్ల మేర ఉంది. ఈ 15 కిలోమీటర్ల పరిధిలో గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్, వెల్లంపల్లి సెంటర్, కొష్టాల సెంటర్, దొడ్డవరప్పాడు, ఏడుగుండ్లపాడు వద్ద ఎక్కువ సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిద్రమత్తు, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలు జరుగటానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. దీనికి తోడు మైనర్లు వాహనాలు నడుపుతూ అవగాహన లేకుండా అతివేగంగా వాహనాల ముందు విన్యాసాలు చేయడంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



లింగంగుంట వద్ద జేసీబీ ఢీకొట్టడంతో నుజ్జు నుజ్జయిన ఆటో



వెల్లంపల్లి వద్ద ఒక బైక్‌పు నలుగురు వెతుండగా ప్రమాదం(ఫైల్)

ప్రమాదాలు నిత్యకృత్యం

ఇటీవల ఘడియపూడి కాలనీకి చెందిన నలుగురు మైనర్లు ఒకే మోటార్ సైకిల్‌పై వెల్లంపల్లి వచ్చి దుస్తులు కొనుగోలు చేసి తిరిగి వెళ్లే క్రమంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. లింగంగుంట సమీపంలో ఆటో డ్రైవర్ వేగంగా వస్తుండగా రహదారిపైకి జేసీబీ కూడా వేగంగా రావడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందగా, మిగిలిన వారికి గాయాలయ్యాయి. వెల్లంపల్లి ఫ్లైఓవర్‌పై టైరు పంచర్ కావడంతో బొలేరో వ్యాన్ నిలిపి ఉండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బొలేరో డ్రైవర్ నాగూర్ బాషా మృతి చెందాడు. ప్రమాదకరమైన రసాయనాలతో వెళుతున్న ట్యాంకర్ గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై నిద్రమత్తులో సైడు వాల్‌ను ఢీకొట్టి డివైడర్‌పైకి ఎక్కింది. అందులో రసాయనం బయటకు వచ్చి ఉంటే ఎంత అనర్థం జరిగేదో అని అధికారులే ఆందోళన చెందారు. మండల పరిధిలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఇవి ముచ్చుకు కొన్ని మాత్రమే. నిత్యం ఏదో ఒక ప్రాంతంతో రహదారిపై ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి కారణం జాతీయ రహదారి నిబంధనలు అవగాహన లేకపోవడం, అతివేగంగా ప్రయాణించడమే. తల్లిదండ్రులకు లైసెన్సులు లేకుండా మైనర్లకు వాహనాలు ఇస్తుండటంతో వారు జాతీయ రహదారిపై అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. జాతీయ రహదారి వెంట ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తే అతివేగంగా ప్రయాణించే వాహనాలను అదుపు చేయడంతో పాటు మద్యం సేవించి వాహనాలను నడిపే వారిని గుర్తిస్తే ప్రమాదాలను అడ్డుకట్ట వేయవచ్చు.



గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద డ్రైవర్లకు ముఖాలు కడిగిస్తున్న ఎస్సై శివరామయ్య

ప్రమాదాలు జరగకుండా చర్యలు

జాతీయ రహదారిపై ప్రమాదాలు తరచూ జరిగే ప్రదేశాలను గుర్తించాం. ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. అర్ధరాత్రి రెండు గంటల నుంచి మూడు గంటల సమయంలో ప్రయాణిస్తున్న వాహనాలను నిలిపి డ్రైవర్లకు ముఖాలు కడిగించి వారు కొద్దిసేపు సేద తీరిన తరువాత వారిని పంపిస్తున్నాం. ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. అయితే అతివేగం వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. – శివరామయ్య, ఎస్సై



గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందిన బొలేరా వాహనం



గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై డివైడర్ ఎక్కిన రసాయనాలతో వెళుతున్న ట్యాంకర్

అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

- బంధువుల రోదనలతో శోకసంద్రంగా మారిన చిన్నగుడిపాడు
- నెలలు నిండిన భార్య వేదనతో కన్నీటిపర్యంతమైన సిబ్బంది
- నివాళుర్పించిన యర్రగొండపాలెం సీఐ, ఎస్సైలు
- ఫోన్‌లో సంతాపం తెలిపిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల: చీమకుర్తి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ దూదేకుల మాభు సుభాని(28) అంత్యక్రియలు ఆదివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. చీమలమర్రి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాభు సుభాని తలకు తీవ్ర గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒంగోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా మండల పరిధిలోని చిన్న గుడిపాడుకు తరలించారు. దీంతో చిన్నగుడిపాడులో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. కుమారుడి మృతదేహాన్ని చూసిన వెంటనే తండ్రి దూదేకుల వలి సొమ్మసిల్లి పడిపోవడంతో ఆయన్ను పెద్దదోర్నాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చిన్న నాటి నుంచి క్రమశిక్షణతో పెరిగి ఓ ఉద్యోగస్తుడైన మాభు సుభాని గ్రామంలో అందరితో కలివిడిగా ఉండటంతో మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

భార్యను వైద్యశాలలో చూయించి వెళుతుండగానే..

తొమ్మిది నెలలు నిండిన భార్య రసూల్‌బీని మార్కాపురంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో పరీక్షలు నిర్వహించిన అనంతరం ఒంగోలు తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మాభు సుభాని మృతి చెందినట్లు బంధువులు పేర్కొంటున్నారు. వచ్చే నెల 10వ తేదీ ప్రసవం అవుతుందని మార్కాపురం వైద్యులు చెప్పారని బంధువులు తెలిపారు. వైద్యశాలలో పరీక్షల అనంతరం తన భార్యకు జాగ్రత్తలు చెప్పి విధులకు బయలుదేరిన వ్యక్తిని లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించిందని కుటుంబసభ్యులు వాపోయారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఐ, ఎస్సై

కన్నీటి పర్యంతమైన సహచర సిబ్బంది

భర్త అకాల మరణంతో 9 నెలల గర్భిణి అయిన భార్య రసూల్‌బీ వేదన వర్ణనాతీతం. ముందు రోజు వరకు తనతో ఉండి తనకు ధైర్యం చెప్పిన భర్త అకస్మాత్తుగా మృతి చెందడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు. భర్త మరణంతో ఇక తనకు దిక్కెవరంటూ ఆమె రోదించడాన్ని చూసిన సహచర సిబ్బంది సైతం కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి మరణ వార్తను తెలుసుకోలేక అమాయకంగా దిక్కులు చూస్తున్న కుమార్తె ఆక్సజాఫ్రిన్‌ను చూసిన కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. మాభుసుబాని మరణవార్త తెలుసుకున్న యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతదేహానికి నివాళులర్పించిన యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై మహేష్, ఎస్పీ కానిస్టేబుల్ గోపాలకృష్ణ మృతుడి భార్య రసూల్‌బీని, తల్లిదండ్రులు వలి, నాగులమీరమ్మలను పరామర్శించారు. అనంతరం గ్రామంలోని కబరస్తాన్‌లో సీఆర్‌పీఎఫ్ పోలీసుల లాంచనాల నడుమ అంత్యక్రియలు నిర్వర్తించారు.



భార్య రసూల్‌బీని ఓదారుస్తున్న సీఐ, ఎస్సై



పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

పొలాల్లో కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకుంటున్న రెస్క్యూ టీం

రాచర్ల: పంట పొలాల్లో కొండచిలువ కలకలం రేపింది. ఈ సంఘటన మండలంలోని జేపీ చెరువులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. జేపీచెరువు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన పొలంలో పొగాకు పంటను సాగు చేశాడు. ఆదివారం ఉదయం పొలంలో పనులు చేసుకున్న సమయంలో 20 అడుగుల కొండచిలువ కనిపించడంతో కూలీలు భయాందోళన గురై పరుగెత్తుకుంటూ పక్క పొలాల్లో వచ్చారు. కొండచిలువను చూసిన కొంతమంది రైతులు గిద్దలూరు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్టు రెస్క్యూ టీం సిబ్బంది వెంటనే జేపీచెరువు గ్రామానికి చెరుకుని పొలంలో ఉన్న 20 అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. ఆ కొండచిలువను గ్రామ సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో విడిచిపెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేపీ చెరువు బీట్ ఆఫీసర్ షేక్ అశ, ఫారెస్టు రెస్క్యూ టీం అశోక్, శివ, ప్రసాదు, కృష్ణ తెలిపారు.

నిలిచిన రాకపోకలు



కోతకు గురైన రోడ్డు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారం–వంగపాడు గ్రామాల మధ్య వెలిగొండ ప్రాజెక్ట్ కాలువపై నిర్మించిన వంతెన సమీపంలో రోడ్డు కోతకు గురైంది. వారం రోజులుగా పడుతున్న వర్షాలకు రోడ్డుకు ఒకవైపున లోతైన గుంత ఏర్పడింది. దీంతో స్కూల్ వ్యాన్‌లు, ట్రాక్టర్లు రోడ్డుపై తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గ్రామంలోకి వ్యాన్‌లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సగం రోడ్డు కోతకు గురైందని, అధికారులు సకాలంలో పట్టించుకోకపోతే రోడ్డు మొత్తం కోతకు గురై పూర్తిగా రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్‌బీఐలో మోగిన ఎమర్జెన్సీ సైరన్

- ఉలిక్కిపడ్డ పోలీసులు, బ్యాంక్ అధికారులు
- విద్యుత్ హైవోల్టేజీతో సైరన్ మోగినట్లు పోలీసుల వెల్లడి

కనిగిరి రూరల్: స్థానిక ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఎమర్జెన్సీ సైరన్ ఆదివారం రాత్రి ఒక్కసారిగా మోగింది. దీంతో ఇటు పోలీసులు, బ్యాంక్ అధికారులు ప్రజలు ఉలిక్కిపడ్డారు. బ్యాంక్ వద్ద జనం గుమికూడారు. బ్యాంకులో సైరన్ మోగుతున్న సమాచారం అందుకున్న ఎస్సై టి.శ్రీరాం హుటాహుటిన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్యాంక్ మేనేజర్, అకౌంటెంట్‌ను పిలిపించారు. వారితో కలిసి బ్యాంకులోకి వెళ్లి పరిశీలించారు. విద్యుత్ హైఓల్టేజీ సమస్య కారణంగా లేదా.. సైరన్ బటన్‌పై బల్లి పడటం వల్ల ఎమర్జెన్సీ బెల్ మోగినట్లు ఎస్సై, బ్యాంక్ అధికారులు నిర్ధారించుకున్నారు. సైరన్ బటన్‌కు యధావిధిగా సరిచేసినట్లు తెలిపారు. విద్యుత్ హై ఓల్టేజీ కారణంగా, లేదా బటన్‌పై బల్లి పడటంతోనే సైరన్ మోగిందని, ఎటువంటి అనుమానాలు లేవని ఎస్సై టి.శ్రీరాం విలేకర్లకు వెల్లడించారు.



బ్యాంక్ వద్ద గుమికూడిన జనం

27న చీమకుర్తిలో జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

చీమకుర్తి: జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఈనెల 27న చీమకుర్తిలోని సీపీఎస్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. చీమకుర్తిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జవహర్, నల్లూరి మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాలుగు దశల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు ఈనెల 27న చీమకుర్తి సీపీఎస్ పాఠశాలలో జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీలకు హాజరుకావాలని తెలిపారు. అనంతరం గోలి రామలింగశర్మ జయంతి సందర్భంగా వారి కుమారుడు కల్యాణ్ కిరణ్ ఆర్థిక సహకారంతో రెజ్లింగ్ క్రీడాకారులకు క్రీడాదుస్తులను అందించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు మాలకొండారెడ్డి, జయప్రకాష్, చలువాది రమేష్, ఆంజనేయులు, వీరారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణహత్య

- బంగారు ఆభరణాల కోసమే హత్య చేసి ఉంటారన్న అనుమానం
- భయాందోళనలో గ్రామస్తులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

సీఎస్‌పురం(పామూరు): పశువుల మేత కోసం పొలానికి వెళ్లిన వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని డీజీపేట గ్రామ సమీప పొలాల్లో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. డీజీపేట గ్రామానికి చెందిన డేగా రత్తమ్మ(60) తమ పశువులకు మేతకోసుకుని వచ్చేందుకు గ్రామ సమీపంలోని పొలాలకు వెళ్లింది. అయితే చీకటిపడినా ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుక్కుంటూ పొలానికి వెళ్లగా రత్తమ్మ మృతదేహం కనిపించింది. ఆమె తలకు, ముఖంపై గాయాలు ఉన్నాయి. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఎం భీమానాయక్, ఎస్సై సుమన్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు, బంధువులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మృతురాలి తలపై ఆయుధంతో బలంగా కొట్టినట్లు ఉందని సీఐ తెలిపారు. మృతురాలి శరీరంపై వేసుకున్న బంగారు ఆభరణాలు లేవని, వాటి కోసమే ఎవరైనా హత్య చేసి ఉండొచ్చన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు. ఈ ఘటనతో గ్రామ ప్రజల్లో ఓ వైపు భయాందోళనలు, ఓ వైపు విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతానికి యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన నాగార్జున

గిద్దలూరు రూరల్: మండలంలోని అంకణాంపల్లెలో విద్యుదాఘాతానికి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన రాచగొర్ల నాగార్జున(26) అనే యువకుడు తన పొలం వద్ద ఉన్న స్టార్టర్ స్విచ్ ఆన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగార్జునను గమనించిన స్థానిక రైతులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఇంటికి తరలించారు. గ్రామానికి చెందిన పిచ్చయ్య రెండో కుమారుడు నాగార్జున తన తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉండేవాడు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.